

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 16 డిసెంబర్ 2025 పేజీలు 8


## స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా...

# అమరావతిలో అమరజీవి స్మృతివనం

- పొట్టిశ్రీరాములు స్ఫూర్తితో తెలుగుజాతిని అగ్రప్రధాన నిలిపేలా సుపరిపాలన
- మూడు రాజధానుల పేరుతో గత పాలకుల మహా కుట్ర
- గత పాలనలో రాజధాని పేరు చెప్పుకోలేని దుస్థితి
- అభివృద్ధి వికేంద్రీకరణతో మూడు ప్రాంతాల అభివృద్ధి
- పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

విజయవాడ, డిసెంబర్ 15: భావితరాలకు గుర్తుండిపోయేలా అమరజీవి పొట్టిశ్రీరాములు స్మృతి వనాన్ని అమరావతిలో నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఆయన పోరాడిన 58 రోజులకు గుర్తుగా రాజధానిలో 58 అడుగుల ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరజీవి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పొట్టిశ్రీరాములు కుటుంబ సభ్యులను సీఎం సత్కరించారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి తెలుగు ప్రజల ఆస్తి అని అన్నారు. తెలుగు ప్రజల ప్రత్యేక రాష్ట్రం కలను ప్రాణాలు తృణప్రాయంగా అర్పించి 58 రోజుల్లోనే సాకారం చేసిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములని సీఎం కీర్తించారు. అమరజీవి మరణంతో తెలుగు ప్రజలు ఉద్యమ బాట పట్టారని.. ఉద్యమ తీవ్రతను గుర్తించిన నాటి ప్రధాని నెహ్రూ ఆంధ్ర రాష్ట్రం ఇస్తామని 1952 డిసెంబర్ 19న ప్రకటించారని అన్నారు. అమరజీవి త్యాగంతో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం అవతరించిందని. కర్నూలు రాజధానిగా 1953, అక్టోబర్ 1 నుంచి తెలుగు ప్రజలకు స్వయం పాలన మొదలైందని వివరించారు. ఆ తర్వాత 1956,నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ భాషా సంయుక్త రాష్ట్రంగా ఏర్పాటైందని అన్నారు. ఈ తేదీలపై కొందరు రాజకీయ దుమారం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అందుకే



అమరజీవి ఆత్మార్పణ చేసిన దినాన్ని డే ఆఫ్ శాక్రిఫైస్‌గా నిర్వహిస్తున్నట్టు సీఎం తెలిపారు.

మిగతా 2లో

### నైనవరం చెరువులలో కబ్జాలపై ...

# దాగుడుమూతలు

- ఇటీవలే కబ్జాలను అడ్డుకున్న అధికార యంత్రాంగం
- మరలా షెడ్డులు నిర్మిస్తున్నా.. చోద్యం చూస్తున్న వైనం
- కార్యదర్శికి నోటీసులు పంపుతామన్న ఇరిగేషన్ అధికారులు
- వచ్చాక చూస్తానన్న పంచాయితీ సెక్రటరీ
- చెరువులో యధేచ్ఛగా షెడ్ల నిర్మాణం
- పెద్ద మొత్తంలోనే అధికారులకు ముడుపులు అందాయంటూ ప్రచారం

వివరాలు 2లో

(విజయవాడ రూరల్ మేజర్ న్యూస్)

ఎవరైనా కబ్జాలకు పాల్పడితే హుటాహుటిన రావడం వాటిని తొలగించడం కొన్ని రోజుల తర్వాత డీల్ మాట్లాడుకొని ఆ స్థానాల్లో నిర్మాణాలు చేపట్టినా పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం అధికారులకు పరిపాటిగా మారింది. తాజాగా పి.నైనవరం చెరువులో కబ్జా జరిగిందని గుర్తించి అటు ఇరిగేషన్ ఇటు రెవెన్యూ అధికారులు పోలీసులను తీసుకెళ్ళి మరీ అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రస్తుతం యధేచ్ఛగా చెరువులో షెడ్ల నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఒకరిపై ఒకరు తోసుకోవడం చర్చనీయాంశంగా మారింది.



# సమిష్టి కృషితో...

## విరమణలు విజయవంతం

భక్తుల నుంచి పూర్తిస్థాయిలో సంతృప్తి

పటిష్ట ప్రణాళికల ఆధారిత ఎస్‌వోపీతో సత్ఫలితాలు

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2

# కనిపించని కరెంటు ఏఈ

### కార్యాలయం ఎక్కడో కనుక్కోవడానికి బోర్డు కూడా లేదు....

### 24 గంటలు మీటింగ్‌లోనే ఉంటున్న ఏఈ

వత్సవాయి డిసెంబర్ 15 మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన వత్సవాయిలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎక్కడుందో తెలుసుకోవాలి అంటే 24 గ్రామాల ప్రజలకు తలనొప్పిగా మారింది! ఎందుకంటే కార్యాలయం ఎక్కడో కనీసం చూసుకోవాలంటే బోర్డు కూడా లేదు విద్యుత్ శాఖలో లైన్మెన్‌లు పెడుతున్న కష్టాలను ఉన్నతాధికారి అయిన విద్యుత్ ఏఈ కార్యాలయ చిరునామా తెలుసుకొని

2లో



## (మొదటిపేజీ తరువాయి)

### కనిపించని కరెంటు ఏఈ



అధికారితో మాట్లాడదామని కార్యాలయానికి వెళితే ఎప్పుడు చూసినా అధికారి విజయవాడ మీటింగ్ కు ఎప్పుడు వెళ్ళినా అదే సమాధానం చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. దేచుపాలెం.. కాకరవాయి గ్రామాలలో ఇటీవల కాలంలో విద్యుత్ సమస్యలు అధికమైనప్పటికీ కనీసం అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. గతంలో ప్రముఖ నాయకుని ఇంటికి పలుమార్లు విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వలన లక్షల రూపాయల ఆస్తి నష్టపోయిన సంఘటన మండల ప్రజలకు తెలియనిది కాదు. వర్షాకాలంలో పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపోయి నేల మీద ఊగుతున్న కూడా ఎన్నిసార్లు ఫోన్ చేసినా కనీసం స్పందించకుండా విద్యుత్ శాఖ ఏఈ చోద్యం చూశారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి వచ్చిన రైతులు తమ విద్యుత్ సమస్యలను చెప్పుకోవడానికి ఎప్పుడు కార్యాలయానికి వచ్చిన సిబ్బంది రైతులపై విసుగుపడుతూ అధికారి ఉన్నప్పుడే రాండి అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని రైతులు తమ గోడును విద్యుత్ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక పంట ఎక్కడ నష్టపోతుందో అని మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత శాఖ అధికారులు మండల కరెంటు ఏఈ పై సంబంధిత చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

# స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా అమరావతిలో అమరజీవి స్మృతివనం

**(మొదటిపేజీ తరువాయి)**

2026 మార్చి 16న శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని...ఆ మహనీయుడిని శాశ్వతంగా స్మరించుకునేలా ఆయన గొప్పతనాన్ని భావితరాలకు తెలిసేలా చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. ఏడాది పాటు జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ 15న 58 రోజుల దీక్షకు గుర్తుగా, మనందరికీ స్ఫూర్తి నింపేలా రాజధాని అమరావతిలో శ్రీ పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. జయంతి రోజున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని, ఇందుకోసం 6.8 ఎకరాల స్థలం కేటాయించా మన్నారు. ఇందులో పొట్టి శ్రీరాములు స్మృతి వనం, అలాగే ఆయన జీవిత విశేషాలతో మ్యూజియం సిద్ధం అవుతోందని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో ఇలా ఒకరి కోసం స్మృతి వనం నిర్మించడం ఇదే తొలిసారి అని.. ఇది శ్రీ పొట్టి శ్రీరాములుకు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవమని ముఖ్యమంత్రి తెలిపారు.

**పొట్టి శ్రీరాములుకు గుర్తింపు ఇచ్చింది ఎన్టీఆర్**

పొట్టిశ్రీరాములు త్యాగానికి గుర్తింపు ఇచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. అందుకే 1985లో తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు పెట్టారు. 2003,మార్చి 10న నెల్లూరు జిల్లాకు ఆయన పేరు పెట్టి కేంద్రానికి పంపాం. ఆ తర్వాతే కేంద్రం జిల్లా పేరును పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నోటిఫై చేసింది. అలాగే చెన్నైలో ఆయన ఆత్మార్పణ చేసిన భవనాన్ని సంరక్షించాలని నిర్ణయించాం. భావితరాలకు గుర్తుండేలా దానిని మెమోరియల్ గా తీర్చిదిద్దుతాం. అలాగే ఆర్య వైశ్యుల సెంటిమెంట్ ను కూటమి ప్రభుత్వం ఎప్పుడూ గౌరవిస్తుంది. ఆర్య వైశ్యుల కులదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాం. అమ్మవారు జన్మించిన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామం పేరును వాసవీ పెనుగొండ అని మార్చాం. ఆర్య వైశ్యుల విన్నపం మేరకు కేస్ట్ సర్టిఫికెట్లలో మార్పులు చేస్తున్నామని సీఎం తెలిపారు. వాసవీ పెనుగొండ మండలంగా పేరు మార్చినందుకు మహిళలు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియచేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

**మూడు రాజధానులు మహా కుట్ర**

గత పాలకులు మూడు రాజధానుల పేరుతో మహా కుట్ర చేశారు. ప్రపంచమంతా మనల్ని అపహాస్యం చేశారు. మన రాష్ట్రం పేరు, రాజధాని పేరు కూడా చెప్పుకోలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చాక మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పగలుగుతున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేసి తెలుగు జాతిని ముందుకు తీసుకెళ్తున్నాం. అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా తయారుచేస్తున్నాం.

తిరుపతి, విశాఖలను మేటి నగరాలుగా తీర్చిదిద్దుతాం. ఇటీవల ఆర్బీఐ ఇచ్చిన నివేదిక ప్రకారం ఫలాలు, చేపలు పండించే ప్రాంతంగా ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు తరలి వస్తున్నాయి. 18 నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజల్ని మభ్య పెట్టేందుకు మెడికల్ కాలేజీల అంశాన్ని కొందరు రాజకీయం చేస్తున్నారు. మెరుగైన చదువు, సేవలు కావాలంటే పీపీపీనే సరైన విధానమని పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది. పీపీపీ విధానంలోనే రహదారులు, ఎయిర్ పోర్టులు వంటి సదుపాయాలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు పీ4 తెచ్చాం. 2047 నాటికి ప్రపంచంలోనే తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెట్టాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అంతకుముందు అమరజీవి జీవిత విశేషాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ముఖ్యమంత్రి తిలకించారు. ఈ కార్యక్రమంలో పలువురు కందుల దుర్గేష్, సవిత, ఆర్య వైశ్య కార్పోరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సమష్టి కృషితో భవానీ దీక్షా విరమణలు విజయవంతం



**ఎన్టీఆర్ జిల్లా, డిసెంబర్ 15, మేజర్ న్యూస్ :** సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, భాగస్వామ్యంతో భవానీ దీక్షల విరమణల ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతమైందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం భవానీ దీక్షల విరమణల కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవానీ భక్తులతో మాట్లాడి ఏర్పాట్లపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అన్నదానం, లడ్డూ ప్రసాదం కేంద్రాలతో పాటు క్యూలైన్లలోని భక్తులతో మాట్లాడారు. అనంతరం ఇంద్రకీలాద్రి మీడియా పాయింట్ వద్ద కలెక్టర్ లక్ష్మీశ.. ఆలయ పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనా నాయక్, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య తదితరులతో కలిసి మాట్లాడారు. దాదాపు ఆరు లక్షల మంది భవానీ భక్తులు వస్తారని ముందే అంచనా వేసుకొని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశామని.. ఇప్పటి వరకు 5.27 లక్షల మంది వచ్చారని తెలిపారు. పటిష్ట ప్రణాళికతో రెవెన్యూ, దేవాదాయ, పోలీస్, విజయవాడ నగరపాలక సంస్థ, అగ్నిమాపక, ఇరిగేషన్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఆధునిక సాంకేతికత, డ్రోన్ అనలిటిక్స్ సహాయంతో, అనుసంధానంతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) మంచి సేవలందించిందన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూశామని, హోల్డింగ్ ప్రాంతాలు, క్యూలైన్లు, పారిశుద్ధ్యం, పుణ్య స్నానాలు, కేశఖండన శాల వద్ద ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈసారి భక్తులు కోరినన్ని లడ్డూలు అందించినట్లు తెలిపారు. నాలుగువేల మంది పోలీసు సిబ్బందితో దాదాపు ఆరువేల మంది అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో సేవలందించారన్నారు. 21.25 లక్షల లడ్డూలు అందించామని, 2,13,645 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు. పటిష్ట ప్రణాళికల ఎస్‌వోపీతో సత్ఫలితాలు వచ్చాయని.. అందుకే దసరా మహోత్సవాలను డాక్యుమెంటేషన్ చేశామని.. భవానీ దీక్షా విరమణలను కూడా దీనికి జతచేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు ఉత్సవాలకు ఈ పుస్తకం కరదీపికలా, ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్టుగా ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

**100 శాతం విజయవంతం: పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ**

అందరి భాగస్వామ్యంతో భవానీ దీక్షా విరమణల కార్యక్రమం 100 శాతం విజయవంతమైందని ఆలయ పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ అన్నారు. ఆలయ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం బ్రహ్మాండంగా సాఫీగా జరిగిందన్నారు. అన్ని వర్గాల నుంచి సానుకూల ఫీడ్‌బ్యాకు లభించిందని తెలిపారు. నిర్మాణాత్మక సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు.

**ఆలయ ఈవో వీకే శీనా నాయక్ మాట్లాడుతూ..** భవానీ భక్తులకు మంచినీటి బాటిళ్లతో పాటు బిస్కట్లు, పాలు అందించామని.. 15 లక్షలకు పైగా నీటి బాటిళ్లు అందించామని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా భవానీ భక్తులకు ప్రత్యేకంగా ఉచిత దర్శన ఏర్పాట్లు కొనసాగుతాయని వీకే శీనా నాయక్ తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.



# నైనవరం చెరువులో కబ్జాలపై దాగుడుమూతలు

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** పి.నైనవరం గ్రామంలోని ఊర చెరువు సర్వే నంబర్ 93 లో 7.3 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోంది. గత నెల నవంబర్ 22వ తేదీన ఎర్ర చెరువులోని సర్వే నంబర్ (43/6) కబ్జా చేసి రేకుల షెడ్డు వేసిన కొంత భూమిని అధికారులు తొలగించారు. ఊర చెరువులోని కొంత భూమిని ఆక్రమించుకుని మట్టి దిబ్బలు వేసిన వాటిని ఇరిగేషన్ అధికారులు పంచాయతీ కార్యదర్శి పోలీసులు దగ్గరుండి తొలగించారు అయినప్పటికీ కొద్దిరోజులు సమయం తీసుకొని మళ్లీ కబ్జా రాయుళ్ళు రెచ్చిపోతున్నారు. తొలగించిన వాటిల్లో మళ్ళీ నిర్మాణాలు చేపడుతున్నా చోద్యం చూడడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**టీడీపీ నేతల అండదండలతోనే..**

గ్రామంలోని 93వ సర్వే నెంబర్లు ఊర చెరువు భూమిని అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్న అధికారులు నిర్లక్ష్యం వహించడం వెనక ప్రభుత్వ పెద్దల సహాయ సహకారాలు ఉన్నాయనే గుసగుసలు వినబడుతున్నాయి., కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటే ఒకలాగా, అనుకూలంగా లేకపోతే ఇంకోలాగా చేయమని టీడీపీ పెద్దలు అధికారులకు హుకుం జారీ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ పార్టీ పెద్దల సహకారంతో నే కబ్జా రాయుళ్ళు చెరువులో మరలా షెడ్లు వేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టీ పట్టనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రధానంగా పంచాయతీ



కార్యదర్శికి,ఇరిగేషన్ అధికారులకు టీడీపీ పెద్దలు బెదిరింపులకు దిగటం,వారు ఇప్పటి వరకు ఆక్రమించుకున్న చెరువు భూమిని తొలగించకపోవడం వెనక గ్రామ సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,టీడీపీ పెద్దల హస్తం ఉందనే గుసగుసలు వినబడుతున్నాయి. గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కమిటివేసినా ప్రయోజనం లేదా? ఎమ్మెల్యే వరకు చెరువు కబ్జాల విషయం తెలియకుండా గ్రామంలోని టీడీపీ పార్టీ పెద్దలే ఆపేస్తున్నారా? ఎవరెవరికి ఎంత ఎంత ముట్టిందో అని టీడీపీ నేతలు పట్ల గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే యార్లగడ్డ కు తెలియపోవటం విడ్డూరంగా ఉందని గ్రామంలోని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి అజేంద్ర నీ వివరణ కోరగా తెలిసిన వెంటనే ఊర చెరువు దగ్గరకు వెళ్లి ఆక్రమించుకున్న భూమిని కట్టుకోవడానికి వీల్లేదని చెబుతున్నప్పటకీ అది మాకు సంబంధించిన భూమి కాదు ఇరిగేషన్ శాఖకి సంబంధించినది గా వారు మాకు ఆర్డర్ ఇస్తే నోటీసులు ఇచ్చి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. మరోవైపు ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ ని వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే చెరువు భూములలో రేకుల షెడ్లను వేసి ఆక్రమించి కట్టడం చట్టరీత్యా నేరమని హెచ్చరించమని చెప్పారు.అయితే ఇరిగేషన్ అధికారులు వెళ్లిన మరుసటి రోజుకే షెడ్డుతోపాటు గోడలు నిర్మించటం కోస మెరుపు....

**రైస్ మిల్ లోనూ చెరువు భూమి కబ్జా?**

పక్కనే ఉన్న రైస్ మిల్లులో చాలా వరకు చెరువు భూమి కబ్జాకి గురైనట్టు తెలిసినా కూడా అధికారులు ఎవరు పట్టి పట్టనట్టు ఉండటం వెనుక పలు అనుమానాలకు దారితీస్తుంది. మిల్ లో సర్వే చేస్తే చెరువు భూమి కలిసిందో లేదో అనేది తెలుస్తుందని గ్రామస్థులు కోరుతున్నారు, ఏదిఏమైనప్పటికీ ఊర చెరువు పై ఆక్రమించుకున్న భూములను తొలగిస్తారా ? లేదా వారికి అనుకూలంగా ఉన్నవారికి సహకరిస్తారా అనేది వేచి చూడాల్సిందే. అయితే చెరువులో ఆక్రమణలపై అధికారుల అలసత్వం...**ముడుపుల భాగోతాల ప్రత్యేక కథనం తరువాయి సంచికలో..**

# భారతదేశంలో ఎడ్జ్ 70ని విడుదల చేసిన మోటరోలా




**విజయవాడ, డిసెంబర్ 15, మేజర్ న్యూస్ :** మొబైల్ టెక్నాలజీ, ఆవిష్కరణల లో ప్రపంచ అగ్రగామి, భారతదేశ అగ్రగామి చ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా, ఈరోజు మోటరోలా ఎడ్జ్ 70ని ప్రారంభించడం ద్వారా తనఅత్యంత సన్నని, అత్యంత రాజీపడని స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. అల్ట్రా – స్లిమ్ ఇంజనీరింగ్‌ను పునర్నిర్వచిస్తూ, ఈ పరికరం నమ్మశక్యం కాని సొగసైన 5.99ఎంఎం ఎయిర్‌క్రాఫ్ట్–గ్రేడ్ అల్యూమినియండిజైన్‌ను కలిగి ఉంది. అదే సమయంలో 40 గంటల బ్యాటరీ జీవితాన్ని ఇచ్చే భారీ 5000ఎంఏహెచ్ బ్యాటరీని అందిస్తుంది. వేగవంతమైన వైర్డ్, వైర్‌లెస్ఛార్జింగ్ తో,అన్ని లెన్స్‌లలో 4కె 60ఎఫ్ పిఎస్ రికార్డింగ్‌తో సెగ్మెంట్‌లోనిఅత్యంత అధునాతన ట్రిపుల్ 50 ఎంపి ఏఐ కెమెరాలు దీనిలో ఉన్నాయి. పనితీరు, తెలివితేటలను తదుపరిస్థాయికి తీసుకెళ్తూ, మోటరోలా ఎడ్జ్ 70, స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ద్వారా ఆధారితమై ప్రపంచంలోనే మొట్టమొదటి అల్ట్రా–థిన్ స్మార్ట్‌ఫోన్‌గా అవతరించింది. ఇది మోటో ఏఐ 2.0, కోపైలట్, గూగు ల్ జెమిని, పెర్ప్లెక్సిటీతోసాటిలేని బహుళ–ప్లాట్‌ఫామ్ ఏఐ స్వేచ్ఛను అందిస్తుంది. ఇది పాంటోన్ ధ్రువీకరణతో సెగ్మెంట్యొక్క ప్రకాశవంతమైన 6.7” సూపర్ హెచ్‌డి అమోలెడ్ డిస్‌ప్లేను కూడా కలిగి ఉంది. ఐపి68 ం ఐపి 69 రక్షణ, ఎంఐఎల్ – ఎస్ టిడి – 810హెచ్ సర్టిఫికేషన్‌తో మిలిటరీ–గ్రేడ్మన్నికను అందిస్తుంది – ఇది ప్రతి కోణంలోనూ నిజంగా రాజీ లేని అల్ట్రా–స్లిమ్ ఫోన్‌గామారుతుంది. మోటరోలా ఎడ్జ్ 70 అల్ట్రా–స్లిమ్ 5.99 ఎంఎం ప్రొఫైల్, అల్ట్రా–లైట్ 159జి బిల్డ్‌తో కొత్త పరిశ్రమ ప్రమాణాన్నినెలకొల్పిం ది.ఇది భారతదేశంలోని ఏకైక అల్ట్రా–సన్నని స్మార్ట్‌ఫోన్‌గా నిలిచింది – బలంతో రాజీ పడకుండా దాదాపు బరువులేనిదిగా అనిపించేలా రూపొందించబడింది. బ్రష్డ్ ఎయిర్‌క్రాఫ్ట్–గ్రేడ్ అల్యూమినియం, ప్రీమియం మెటల్ ఫ్రేమ్, మె టల్ కెమెరా మాడ్యూల్, యాక్సెంటెడ్కెమెరా రింగులతో రూపొందించబడిన ఇది వినియోగదారుల డిమాండ్ నుం డి ప్రేరణ పొందిన సరికొత్త ఎడ్జ్–సిరీస్డిజైన్ లాంగ్వేజ్‌ను ప్రారంభించింది. ఈ పరికరం మూడు పాంటోన్ క్యూరే టెడ్ రంగులలోవస్తుంది,పనితీరులో రాజీ పడకుండా చక్కదనం, హస్తకళ, మన్నికను మిళితం చేసేప్రీమియం టెక్స్చర్డ్ ఫినిష్ ను కలిగి ఉంటుంది.

ఈ ఆవిష్కరణ సందర్భంగా మోటరోలాఇండియా మేనేజింగ్ డైరెక్టర్ టి.ఎం. నరసింహన్ మాట్లాడుతూ, “మోట రోలాలో, వినియోగదారులు నిజంగా దేనినివిలువైనదిగా భావిస్తారనే దానిపై లోతైన అవగాహనతో ఉద్దేశపూర్వక ఆవిష్కరణలను తీసుకురావడంద్వారా మేం సంప్రదాయ సరిహద్దులను సవాలు చేస్తూనే ఉన్నాం. మోటరోలా ఎడ్జ్ 70తో, అల్ట్రా–స్లిమ్ స్మార్ట్‌ఫోన్ఎలా ఉంటుందో తిరిగి ఊహించుకునే పరికరాన్ని పరిచయం చేయడానికి మేం గర్విస్తున్నాం – కెమెరాలు, శక్తి, తెలివితేటలు లేదా మన్నికపై రాజీపడకుండా నమ్మశక్యం కాని సన్నని డిజైన్‌ను అందిస్తుంది. ప్రీమియం, డిజైన్–ఫస్ట్, ఏఐ–ఆధారిత అనుభవాలను అందించే మాప్రయాణంలో ఈ ఆవిష్కరణ ఒక ముఖ్యమైన అడుగు ముందుకు వేస్తుంది. ఇది వినియోగదారులు అందంగా రూపొందించబడిన,లో తైన సామర్థ్యం కలిగిన సాంకేతికతతో మరింత చేయడానికి, మరింత వ్యక్తీకరించడానికి, వారిదైనందిన జీవితా న్ని ఉన్నతీకరించడానికి వీలు కల్పిస్తుంది” అని అన్నారు.

# చివరి రోజు భవాని దీక్షల సేవలలో జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు




**ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ :** ఇంద్రకీలాద్రిలో ఈనెల 11 నుంచి 15 వరకు జరుగుతున్న భవాని దీక్షల విరమణ సేవలలో 100 మంది ఎన్టీఆర్ జిల్లాకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు(ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మేరిస్టెల్లా కళాశాల, విజయ ఇన్నాప్ టెక్నాలజీ ఫర్ ఉమెన్, కేబీఎన్ కళాశాల) పాల్గొని భవాని దీక్షల విరమణకు విచ్చేసిన భక్తులకు దేవస్థానం వారు ఏర్పాటు చేసిన సదుపాయాలు (అన్నప్రసాదాలు, లడ్డు ప్రసాదాలు, తాగునీరు, మెడికల్,సానిటరీ, క్యూ లైన్లు, పాలు, చంటి పిల్లలకు ట్యాగ్) మొదలగు సదుపాయాలు మీద అభిప్రాయ సేకరణ నిర్వహించినట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ఐదు రోజులు పాటు నిర్వహించిన అభిప్రాయ సేకరణ సర్వేలో సుమారు 10,232 మంది భక్తుల నుండి అభిప్రాయ సేకరణ సేకరించినట్లు వారందరూ దేవస్థానం వారు కల్పించిన సదుపాయాల మీద సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఒక్క క్యూ లైన్ లో నియంత్రణ మినహా మిగతా అన్ని సదుపాయాలు చాలా చక్కగా ఉన్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ చేయడం పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు ఇలాంటి సేవలు చేయడం మాకు లభించిన అవకాశంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశకి, ఈవో శీను నాయక్‌కి ఏవో గంగాధరంకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# క్రిప్టో కరెన్సీలో గణనీయమైన సంఖ్యలో మహిళా భాగస్వామ్యం

**విజయవాడ మేజర్ న్యూస్ :** క్రిప్టో కరెన్సీలో మహిళల భాగస్వామ్యం గణనీయమైన సంఖ్యలో పెరుగుతుందని కాయిన్ స్విచ్ ప్రతినిధి ఆశిష్ సింఘాల్ తెలిపారు. ఈ మేరకు దేశంలోని ఆర్థిక రంగానికి చెందిన మార్పులు, లాభ నష్టాలు, పెట్టుబడులు తదితర అంశాలపై కాయిన్ స్విచ్ వార్షిక నివేదిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న కాయిన్ స్విచ్ తాజాగా తన వార్షిక నివేదిక 2025 ఎడిషన్ ను ప్రకటించిందన్నారు. 2.5 కోట్లకు పైగా వినియోగదారుల నుండి వచ్చిన అభిప్రాయాలను, వారిచ్చిన విలువైన సలహాల ఆధారంగా నివేదిక ఒక ముఖ్యమైన ధోరణిని హైలైట్ చేస్తుందన్నారు. మెట్రోల నుండి భారత్‌కు స్పష్టమైన మార్కెట్ మార్పు కన్పిస్తుందని, ఈ ఏడాది ఎడిషన్ రాష్ట్ర స్థాయిలో ఉన్న సరికొత్త మార్పులను లోతుగా పరిశీలిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మహిళలు, పురుషుల ధోరణిలో స్పష్టమైన వైవిధ్యం కన్పిస్తుందని, మహిళా పెట్టుబడిదారులు రాష్ట్రంలో ఒక అద్భుతమైన శక్తిగా ఉద్భవించారని చెప్పారు. మొత్తం క్రిప్టో స్వీకరణలో మహిళలు 59 శాతం వాటాని వారు కలిగి ఉన్నారు. పురుషుల భాగస్వామ్యం (మొత్తం స్వీకరణలో 41 శాతం) నుంచి రాష్ట్రంలో 18 శాతం గా ఉందన్నారు. దీని వలన భారతదేశంలో క్రిప్టో పెట్టుబడిలో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా నిలిచిందన్నారు. పోర్ట్ ఫోలియో దృక్కోణం నుంచి ఒక్కసారి చూస్తే, ఆంధ్రప్రదేశ్ వైవిధ్యభరితమైన ప్రొఫైల్‌ను ప్రదర్శించిందని, లార్జ్ క్యాప్ ఆస్తులు 33.3 శాతం వద్ద ఉన్నాయి, ఇది భారతదేశంలో లార్జ్–క్యాప్ ఆస్తులకు బలమైన ప్రాధాన్యత అని చెప్పారు. రాష్ట్రం యొక్క మిడ్ క్యాప్ ఆస్తులకు కేటాయింపు 21.0 శాతం, స్మాల్ క్యాప్ 28.5 శాతం వద్ద ఉంది, అయితే బ్లూ చిప్ ఆస్తులు పోర్ట్‌ఫోలియోలో 17.3 శాతం ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. ఇది రిస్క్, వృద్ధికి సమతుల్య విధానాన్ని ప్రతిబింబిస్తుంది.”2025 భారతదేశ క్రిప్టో మార్కెట్‌కు స్పష్టమైన పరిపక్వత కలిగిన సంవత్సరం” అని అన్నారు. “పెట్టుబడిదారులు ప్రారంభ ఉత్సాహాన్ని దాటి ముందుకు సాగడం, మరింత సమాచారంతో కూడిన, దృఢ నిశ్చయంతో నిర్ణయాలు తీసుకోవడం మనం చూస్తున్నామని చెప్పారు. మెట్రో నగరాలు బలమైన ఆసక్తిని రేకెత్తిస్తూనే ఉండగా, భారతదేశంలోని నాన్ మెట్రో భౌగోళిక ప్రాంతాలలో దత్తత యొక్క విస్తృత కథ విస్తరిస్తోందని, ఇవి ఇప్పుడు దేశంలోని క్రిప్టో కార్యకలాపాలలో 75 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయన్నారు. భారతీయ ఈక్విటీ మార్కెట్లలో కూడా అదే ఊపు కనిపిస్తుంది, ఇక్కడ నాన్ మెట్రోలు పెరుగుతూనే ఉన్నాయి, తదుపరి మిలియన్ పెట్టుబడిదారులను అందించడానికి సిద్ధంగా ఉన్నాయి.” అని అన్నారు. ఇక జాతీయ స్థాయిలో, టైర్ 2 నగరాలు వినియోగదారుల బేస్‌లో 32.2 శాతం వాటాను కలిగి ఉండగా, టైర్ 3, టైర్ 4 నగరాలు 43.4 శాతం వాటాను అందించాయని, ఇది భారతదేశ క్రిప్టో కార్యకలాపాలలో ఎక్కువ భాగం ఇప్పుడు మెట్రోలకు మించి విస్తరిస్తోందని సూచిస్తుందన్నారు. మొత్తం పెట్టుబడులలో 13.0 శాతంతో ఉత్తరప్రదేశ్ అతిపెద్ద సహకారిగా ఉద్భవించిందని, మహారాష్ట్ర 12.1 శాతం, కర్ణాటక 7.9 శాతం దగ్గరగా ఉన్నాయన్నారు. బీహార్ వృద్ధి ఆధారిత పోర్ట్ ఫోలియోల నుండి ఆంధ్రప్రదేశ్‌లో మహిళా పెట్టుబడిదారుల అధిక వాటా వరకు, 2025 భౌగోళికంగా పంపిణీ చేయబడిన, జనాభాపరంగా వైవిధ్యమైన క్రిప్టో పర్యావరణ వ్యవస్థను ప్రతిబింబిస్తుందని, ఇది భారతదేశంలోని విస్తృత పెట్టుబడి జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు.




## గ్రామ పంచాయతీలకు బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్స్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణలో భాగంగా ఇంటింటి నుంచి తడి చెత్త – పొడి చెత్త వేరుగా సేకరించేందుకు ఏడు బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్స్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుండి మన జిల్లాకు అందాయి. వీటివల్ల గ్రామాల్లో చెత్త సేకరణ సులభతరమవుతుంది. ఈ ఆటోలను గౌరవ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో పి.లావణ్య కుమారి, డివిజనల్ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు పతాకావిష్కరణలు



**మొవ్వ మేజర్ న్యూస్ :** సిఐటియు అఖిలభారత 18 వ మహాసభలు డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగు తున్నా నేపథ్యంలో మహాస భల జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సిఐటియు జెండా ఆవిష్కరణలు మొవ్వ మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. మండలంలో అవురుపూడి గ్రామంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బిల్డింగ్ నాయకులు ఏనుగు శ్రీనివాసరావు ఎలి యాస్ కొండా, మండల కేంద్రంమైన మొవ్వలో ఆటో స్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, ఫ్లాట్ రిక్షా స్టాండ్ వద్ద శీలం కాటయ్య జెండా ఆవిష్కరణ చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామా ల్లో జరిగిన జెండా ఆవిష్కరణలు ఘనంగా జరిగాయి. ముఠా వర్కర్స్ నాయకులు రమేష్, ప్రసాద్, నాంచారయ్య, సిఐటియు మండల నాయకులు కొడాలి శ్రీనివాస్, బిల్డింగ్ నాయకులు గోపి, శ్రీనివాసరావు సాయి, చిగురుపల్లి సుబ్రహ్మణ్యం పంచాయతీ వర్కర్స్ యూనియన్ యూనియన్ నాయకులు ప్రసాద్, జయమ్మ, ఎల్లమ్మ, ఆశా వర్కర్స్ మండల నాయకులు గోవాడ దేవామణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉండ్రపూడి గ్రామానికి చెందిన మెరుగు అరవింద కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అందజేశారు. కుమార్ రాజా స్వయంగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయలు చెక్కును అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన బూరగడ్డ వెంకట కృష్ణారావు ప్రమాదవశాత్తు గాయపడి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన గృహమునకు వెళ్ళి ఎమ్మెల్యే కుమార్ రాజా పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణారావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజాతో పాటు పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండపాక శంకరబాబు, ఉండ్రపూడి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది తూమాటి రంగనాథ్‌కు కొల్లూరి నివాళి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ప్రముఖ న్యాయవాది తుమాటి రంగనాథ్ 36 వ వర్ధంతి సందర్భంగా ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం స్థానిక కోర్టు సెంటర్లో ఉన్న తూమాటి రంగనాథ్ స్థూపానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తూమాటి కామేశ్వరరావు, తూమాటి లక్ష్మణరావు, సింహాద్రి రామనాథ్, పరుచూరి రాఘవేంద్రరావు, సామర్ల రాముడు, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



## అమరజీవి పొట్టి శ్రీరాములుకి ఘన నివాళులు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అవనిగడ్డ మండల ఆర్య సంఘం, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహాల వద్ద ఘన నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో అవనిగడ్డ గ్రామ వైశ్య ప్రముఖులు మానేపల్లి పెదకోటయ్య, దేశు జగన్ మోహన్ రావు, మానేపల్లి రుషి, కోడూరు సంపూర్ణమల్లేశ్వరరావు అద్దేపల్లి నాంచారయ్య, నంబూరు వెంకటేశ్వరరావు నంబూరు సుబ్రమణ్యం కొనకళ్ళ రామమోహన్రావు గుగ్గిలం శ్యామ్ కుమార్ కోడూరు సంపూర్ణమల్లేశ్వరరావు మానేపల్లి మల్లీ మానేపల్లి సుబ్బారావు అద్దేపల్లి కృష్ణ మానేపల్లి పిచ్చేశ్వరరావు వేముల భాను వేముల వెంకటేశ్వరరావు మానేపల్లి చంద్ర విస్సంశెట్టి శేష మానేపల్లి కుమార్ పువ్వాడ అశోక్ మానేపల్లి ప్రవీణ్ చెన్నగిరి అయ్యప్ప తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాజశేఖర్ స్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ ఘంటసాల రాజమోహన్రావు పర్యవేక్షించారు. ఐ వి ఎఫ్ స్టేట్ వాణిజ్య వ్యవహారాల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి చంద్రశేఖర్, అకౌంట్స్ ఆఫీసర్ బి సత్యనారాయణ మూర్తి కార్పొరేషన్ సిబ్బందితో నివాళులర్పించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి మహాత్ములను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం కోసం శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన కృషి వెలకట్టలేనిదని, భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు ప్రాంతీయ భాషలు, సంస్కృతులను పరిరక్షించడంలో ఆయన పాత్ర కీలకమైనదని, ఆంధ్రుల ఆశయ సాధన కోసం ఆయన చేసిన త్యాగానికి పొట్టి శ్రీరాములు మరణాంతరం అమరజీవి అనే బిరుదు ప్రధానం చేశారని, తెలిపారు. దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాలను చేపట్టారని, ఇటువంటి మహనీయుల వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకోవటమే కాకుండా భావితరాలకు వారి గురించి తెలియజేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములుకి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. వారి త్యాగఫలితంగానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని, నేటి తరాలు వారి ఆశయాలను స్మరించుకొని సమాజ సేవలో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌలేశ్వర స్వామి వారి దేవస్థాన (పెద్ద శివాలయం) చైర్మన్ మహంకాళి జయప్రకాష్, కొప్పు సుధాకర్, బండారు రవి, కొత్తమాసు రామారావు, కర్లపాటి కొండ, చిన్నం ప్రసాదు, మోటమర్రి లక్ష్మి, కంభంపాటి మోహన్, తుగ్గల పురుషోత్తం, చిత్తలూరి చంద్రశేఖర్, శ్రీకాంత్, పెనుగొండ రామకృష్ణ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



### కొణతమాత్మకూరులో పీఏసీఎస్ రుణ పంపిణీ కార్యక్రమం

### పీఏసీఎస్ రుణ పత్రాలు అందజేసిన కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ :** నందిగామ మండలం, కొణతమాత్మకూరు గ్రామంలో పీఏసీఎస్ సహకార సంఘ సభ్యులకు రుణ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరై, అర్హులైన రైతులకు రుణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు అమరజీవి పొట్టి శ్రీరాములు భారత ఐక్యత శిల్పి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు వారి వ్యవసాయాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. రైతులు రుణాలను సకాలంలో వినియోగించి, సమృద్ధిగా పంటలు పండించి ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. అలాగే రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందించేందుకు ప్రభు త్వం అనేక సంస్కరణలు, ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి రైతు సహకార సంఘాలను సద్వినియోగం చేసు కొని, ప్రభుత్వ పథకాల ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను పూర్తిగా పొందా లని సూచించారు. వ్యవసాయం అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, రైతుల అభ్యున్నతికి తమవంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొనతమాత్మకూ రు సొసైటీ చైర్మన్ చెరుకూరి సాంబశివరావు,కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ మన్నే కళావతి, నందిగామ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు, సొసైటీ పాలకవర్గ సభ్యులు దగ్గుపాటి నిర్మల, కాంబోజి కొండ,చెరుకూరి హైమారావు,జవ్వాజి భాస్కరరావు, గింజుపల్లి శ్రీనివాసరావు, చిట్లూరి మౌలేశ్వర రావు, మేడ రాధాకృష్ణమూర్తి, వేజెండ్ల రవీంద్రబాబు, కేశగాని వెంకన్న, కోవెలమూడి వెంకటేశ్వరరావు, అబ్బూరి వెంకటేశ్వరరావు, మన్నేపల్లి వినయ్, మల్నీడి ప్రసాద్, జంగాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

### కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో స్వాతంత్ర్య సమర యోధులు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ పూలమాలలు వేసి పుష్పాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీజీ వెంట నడిచి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్పించిన మహనీయులని, భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులుగా నిలిచారని ప్రశంసించారు. ఆయన చేసిన త్యాగాన్ని నేడు ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవడం మన కర్తవ్యం అన్నారు. తెలుగు జాతి గర్వించే విధంగా అందరూ కలిసికట్టుగా రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డిఓ స్వాతి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డ్వామా పీడీ శివప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ సోమశేఖరు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, డిపిఓ డాక్టర్ జె అరుణ, జిల్లా ఉద్యాన అధికారి జె జ్యోతి, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, ఆర్ అండ్ బి ఈ ఈ లోకేష్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి



**కోడూరు మేజర్ న్యూస్ :** పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పూతబోయిన సీతారత్న సాయిబాబు,మర్రి గంగయ్య ఆమరణ నిరాహార దీక్ష (58 రోజులు) పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు. తెలుగు మాట్లాడే ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు. పొట్టి శ్రీరాములు మరణం తరువాత దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చెలరేయడంతో, అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, 1952 డిసెంబర్ 19న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకటించారు. రాష్ట్ర ఏర్పాటు 1953 అక్టోబర్ 1న ఏర్పడింది. ఈ కార్యక్రమంలో కోడూరు జనసేన పార్టీ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మొవ్వ మండలంలో పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి



**మొవ్వ మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి మండల కేంద్రమైన మొవ్వ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పువ్వాడ సురేష్ షాపు వద్ద పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ నిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి పువ్వాడ సురేష్, నందిపాటి. వెంకటేశ్వర్లు,మాటూరీ వెంకటేశ్వరరావు, మండవ గోపి, మాటూరి. బ్రహ్మయ్య, వెంకట్, నందిపాటి. ఆంజనేయులు, బెజవాడ. సాంబశివరావు, నందిపాటి. సత్యనారాయణ, చిట్టూరి. శ్రీనివాసరావు పలువురు ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు భవన నిర్మాణ కార్మికులు, ఆటో వర్కర్స్, రిక్షా కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ ప్రతిధులు స్వీట్లు పంపిణీ చేశారు.

## పామర్రు మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో..



**పామర్రు మేజర్ న్యూస్ :** అమర జీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పరిష్కరించుకొని మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వద్దగల పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక వాసవి వృద్ధాశ్రమంలో కూడా పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వత్తుమిల్లి వీరాంజనేయ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నం మురళి సుధాకర్, ఉపాధ్యక్షులు ఊటుకూరి నాగ వెంకట హనుమపిచ్చేశ్వరరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు మండా కమలాకరనాథ్, వాసవి క్లబ్ జిల్లా వాసవి కుటుంబ సంరక్ష పథకం చైర్మన్ బొగ్గవరపు సాయిబాబు, వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి కంచర్ల జనార్దనరావు, కోశాధికారి కోట ప్రణీత్, వాసవి వృద్ధాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ ఘంటసాల భరతుడు, కృష్ణాజిల్లా ఆర్యవైశ్య యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మానేపల్లి సత్యసాయి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

# అధికారులతో సమావేశమైన డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ డిసిఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా సూర్యారావుపేట పీసపాటి వారి వీధిలో ఉన్న కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. డీసీఎంఎస్ పరిధిలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు రైతులకు చౌక ధర దుకాణాల ద్వారా అందిస్తున్న ఎరువుల వివరాలను అనంతరం డిసిఎంఎస్ పరిధిలో ఉన్న భూములను, గిడ్డంగులను,మూల నిధులు రావలసిన నిధుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్ సొసైటీ ద్వారా జరిగిన వ్యాపార లావాదేవీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డీసీఎంఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాల ఆక్రమణలను తొలగించి స్వాధీన పరుచుకుని రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని అనుమతులు రాగానే ఖాళీ స్థలాలను గోడౌన్లుగా,కళ్యాణ మండపాలుగా తీర్చిదిద్ది డిసిఎంఎస్ ఆదాయ వనరులు పెంచుతామన్నారు.రైతు శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నదాతకు మేలు చేసే విధంగా కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ మార్కెట్ సొసైటీ కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ మంత్రి అచ్చంనాయుడును ఇటీవల కలిసి సహకారం అందించవలసిందిగా కోరినట్లు తెలిపారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు పురుగుమందులు అతి తక్కువ ధరకు లభ్యమయ్యేలా ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా కోఆపరేటివ్ మార్కెట్ సొసైటీ పరిధిలో నూతన దుకాణాల అనుమతి కొరకు ప్రభుత్వానికి నివేదిక పంపామని అనుమతులు రాగానే అన్నదాతకు మేలు జరిగేలా చర్యలు చేపడతామన్నారు. జనరిక్ ఔషధ దుకాణాలను ఏర్పాటుచేసి ప్రజలకు తక్కువ ధరకు మందుల విక్రయాన్ని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు.రైతులకు ఏ పంట వేస్తే లాభసాటిగా ఉంటుందో అవగాహన కల్పించి ఆ పంటలను ప్రోత్సహిస్తామన్నారు.భారతదేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్న పంటలపై దృష్టి కేంద్రీకరించి వాటిని మన నేలలో పండించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు.అందరూ ఒకే రకమైన పంటలను పండించడం వల్ల గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోవలసిన పరిస్థితి వస్తుందని దీనిపై పూర్తిగా అధ్యయనం చేసి డిమాండ్ ఉన్న పంటలను ప్రోత్సహించి తద్వారా రైతుకు లాభదాయకమైన పంటలను పండించేందుకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు బిజినెస్ మేనేజర్ యు.వి.ప్రసాద్ రావు మేనేజర్ ఆర్.రమేశ్ బాబు ఓ ఎస్ డి,వి.సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 21న విశిష్ట సేవా మహోత్సవం



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎంపీ కేసినేని శివనాద్ నేతృత్వంలో డిసెంబర్ 21న విశిష్ట సేవా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చాంబర్ ఆఫ్ రియల్టర్స్ అండ్ బిల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అత్తలూరి నాగమల్లేశ్వరరావు అధ్యక్షుడు సారేపల్లి శరత్ తెలిపారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగే ఈ సేవా మహోత్సవంలో 100 మంది మార్గదర్శులను విశిష్ట అవార్డులతో సత్కరిస్తామని చెప్పారు. గురునానక్ నగర్ లోని ఎంపీ కేసినేని శివనాథ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాంబర్ ఆఫ్ రియల్టర్స్ అండ్ బిల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అత్తలూరి నాగమల్లేశ్వరరావు అధ్యక్షుడు సారేపల్లి శరత్ తదితరులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గత ఉగాదినాడు ప్రారంభించిన పి ఫోర్ పథకంలో భాగంగా 100 మంది మార్గదర్శుల ద్వారా 1000 మంది బంగారు కుటుంబాలకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 21న విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళ క్షేత్రంలో జరిగే సేవా మహోత్సవంలో మంత్రులతో పాటు సినీ నటుడు సుమన్ యాంకర్ సుమ, తదితరులు పాల్గొంటారని వివరించారు. సీఎం చంద్రబాబు పేదరిక నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలకు తమ వంతుగా 100 మంది మార్గదర్శులను సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ విశ్వనాథ్, త్రిశూల్ బసవేశ్వర రావు,రేఖ రాణి, కుమారి తదితరులు పాల్గొన్నారు...

# కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు




**గన్నవరం, డిసెంబర్ 15, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదని ఆ పార్టీ సీనియర్ నాయకులు, గన్నవరం ఎంపీపీ అనగాని రవి విమర్శించారు. సోమవారం గన్నవరంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. మర్లపాలెం గ్రామానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కలిసిన ఇద్దరిపై టీడీపీ నేతలు దాడి చేసి తీవ్రంగా కొట్టడం అమానుషమన్నారు. ఇటువంటి ఘటనలు కూటమి ప్రభుత్వంలో పరిపాటిగా మారాయని అన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఎప్పటికీ ఇదే ప్రభుత్వం అధికారంలో ఉండదన్న విషయాన్ని అధికారులు కూడా గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేసిన అధికారులు, కూటమి నేతలపై చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలోనే 50 వేల మందికిపైగా ప్రజలు ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాలు చేశారని వెల్లడించారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి తెచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒకేసారి 27 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వాటిలో ఆరు మెడికల్ కాలేజీలను గత ప్రభుత్వమే పూర్తి చేసిందన్నారు. మిగిలిన కళాశాలలను పూర్తిచేయకుండా కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు నిర్ణయించడం దుర్మార్గమని తీవ్రంగా విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాల భూములు కారుచౌకగా కట్టబెడుతున్న ప్రభుత్వం, మెడికల్ కాలేజీల నిర్మాణానికి నిధులు లేవని చెప్పడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు గోరంతగా ఉండి, ప్రచారం మాత్రం కొండంతగా ఉందన్నారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కూడా కూటమి ప్రభుత్వం ద్వంద వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు మాయమయ్యారని గత ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై మౌనం పాటించడం గమనార్హమని ఎద్దేవా చేశారు.

## కేకేకు సత్కారం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన, కళ్యాణం శివ శ్రీనివాసరావు కేకేను మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డంరాజు, కూనపురెడ్డి ప్రసాద్, మంత్రి పృద్వి, కోలపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు రాబోయే జనవరి, ఫిబ్రవరి నెలల్లో సమర్పించండి

### సబ్ ట్రెజరీ అధికారి వి.రమేష్ కుమార్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తమ లైఫ్ సర్టిఫికెట్లను స్థానిక సబ్ ట్రెజరీ అధికారి వారి కార్యాలయంలో గానీ, సమీపంలో గల పోస్ట్ ఆఫీస్ లో గానీ, తమకు అందుబాటులో ఉన్న నెట్ సెంటర్లలో గాని, 2026 జనవరి, ఫిబ్రవరి నెలలలో ఫిబ్రవరి 28 లోపు, సమర్పించాలని, సకాలంలో పెన్షన్ పొందాలని బందరు సబ్ ట్రెజరీ అధికారి వి.రమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## చిన్నారుల బంగారు భవిష్యత్తుకై పోలియో చుక్కలు తప్పక వేయించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టరేట్ లో చాంబర్‌లో ఈనెల 21వ తేదీ జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఈ నెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## పాత రేపూడిని గ్రామపంచాయతీగా ప్రకటించాలి



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** రేపూడి గ్రామంలో ఉమ్మడి పంచాయతీగా ఉన్న పాత రేపుడి గ్రామాన్నీ పంచాయితీగా ప్రకటించాలని పాతరేపూడి గ్రామంలో పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసి వర్గాలు అందరూ కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో పాల్గొన్న స్థానికులు, పలు సంఘాల నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 97 ప్రకారం మా గ్రామ జనాభా 2500 మంది ఉన్నారని ఆలాగే ఓటర్లు 1700 మంది ఉన్నారని తమ పాత రేపూడి గ్రామానికి ప్రత్యేక పంచాయతీ అవ్వటానికి అన్ని రకాల అర్హతలు ఉన్నాయన్నారు. కొంతమంది నాయకులు తమ రాజకీయ దుర్బుద్ధితో ఈ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ అవ్వకుండా అడ్డుకోవడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీలు ఎక్కువగా ఉన్న ఈ గ్రామం ప్రత్యేక పంచాయతీ అవ్వాలని ప్రభుత్వ ఇస్తున్న అన్ని పథకాలు అన్ని సౌకర్యాలు అందాలని,, అభివృద్ధి చెందాలని ప్రజలు కోరుకుంటున్నారు అన్నారు. ప్రత్యేక పంచాయతీ చేయడం వల్ల గ్రామం అభివృద్ధి చెందుతుందని అలానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పాతరేపుడిని గ్రామపంచాయతీ గా ప్రకటించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.



## సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే

**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొండాయిపాలెం గ్రామంలో జరిగిన "సెమీ క్రిస్మస్" వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. స్థానిక బేతనీయ చర్చి ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనలో కూడా ఆయన పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామస్తులు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్పల ఇరుముడిలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో గల శివాలయంలో జరిగిన అయ్యప్ప స్వాముల ఇరు ముడి కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన అయ్యప్పల శబరిమల యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో మండల కాలం పాటు దీక్ష చేసిన అయ్యప్పలు మొక్కుబడులను చెల్లించేందుకు శబరిమల వెళ్లి రావడం శుభప్రదమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే కుమార్ రాజాను సత్కరించారు. తొలుత కుమార్ రాజా ఆలయంలో స్వామివారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆయనకు ఆశీర్వచనం అందించారు.

## నాగరాజు చిత్రపటం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో జరిగి న దేసి నాగరాజు పెదకర్మ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భం గా నాగరాజు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొద్దిసేపు కుటుంబ సభ్యులతో గడిపిన ఎమ్మెల్యే వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజాతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 15, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్‌కు చెందిన ఆరేపల్లి అప్పారావు – శారద దంపతులు శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి దేవస్థానం నిర్మాణానికి రూ.54,000/- విరాళంగా అందించారు. ఈ సంద ర్భంగా దాతలైన అప్పారావు – శారద దంపతులు, వారి కుటుంబ సభ్యుల ను శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి వారు ఎల్లవేళలా కాపాడాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన దాతలకు ఆలయ కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## విధుల్లో చేరిన నూతన కార్యదర్శులు



**గుడ్లవల్లేరు డిసెంబర్ 15 మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరు మండలం, వేమవరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేయు చున్న పొమర్తి శివ నాగమల్లేశ్వరరావు (గ్రేడ్ 2) ప్రమోషన్ ద్వారా (గ్రేడ్ – 1) పెంజేంద్ర గ్రామ పంచాయతీ లో, ముదినేపల్లి మండలం వడాలి గ్రామ పంచాయతీ కార్యదర్శి ( గ్రేడ్ 2) గా పనిచేస్తున్న శ్యామ్ సుందర్ ప్రమోషన్ లో భాగం గా అంగలూరు గ్రామ పంచాయతీ లో గ్రేడ్ 1 కార్యదర్శిగా ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్ సమక్షంలో విధులలో చేరడమైనది. సదరు కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ వి.ఎలీషారావు డిప్యూటీ ఎంపిడిఓ జివిఎస్ అంజనాదేవి కార్యదర్శులు ఎజెఎల్ నరసింహారావు, బలగం వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన పొదుపుతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు..




**ఎన్‌టీఆర్ జిల్లా, డిసెంబర్ 15, మేజర్ న్యూస్ :** సమష్టి భాగస్వామ్యంతో ఇంధన పొదుపుతో స్వర్ణాంధ్ర @ 2047 దిశగా అడుగులు వేద్దామని.. మహోద్యమంగా ఇంధన పొదుపును ముందుకు తీసుకెళ్దామని ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు–2025 (డిసెంబర్ 14–20)లో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వరకు జరిగిన ర్యాలీ, స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి, నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఏపీ సీపీడీసీఎల్.. బీఈఈ సౌజన్యంతో స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, పవర్ యుటిలిటీ డైరెక్టర్లు తదితరులతో కలిసి జాతీయ ఇంధన పొదుపు పోస్టర్లను ఆవిష్కరించారు. అత్యంత విలువైన విద్యుత్ ఏ రూపంలోనూ వృథా కాకుండా ఎల్లప్పుడూ జాగ్రత్తగా వ్యవహరిస్తానని.. విద్యుత్ పొదుపు సందేశం అందరికీ చేరేలా పాటుపడతానంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జెన్‌కో ఎండీ నాగలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తులు, పారిశ్రామిక సంస్థలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిఒక్క వ్యక్తి, సంస్థ ఇంధన పొదుపు దిశగా పయనించాలని.. భవనాలు కూడా హరిత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఇప్పటికే 1,400 వరకు వాణిజ్య భవంతులు ఇంధన పొదుపు ప్రమాణాలను పాటిస్తున్నాయన్నారు. గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ప్రొద్యూమర్ (ప్రొడ్యూసర్ ప్లస్ కన్స్యూమర్)గా ఎదగాలన్నారు. నికర శూన్య ఉద్గారాలు (నెట్ జీరో ఎమిషన్) అనేది స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక లక్ష్యమని.. దీని సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందని, ఇంధన పరిరక్షణ, సామర్థ్యంలో ఏపీ వరుసగా జాతీయస్థాయి అవార్డులు సొంతం చేసుకుంటోందని.. సమష్టి కృషే ఇందుకు నిదర్శనమని ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు.

**ప్రతి ఇల్లూ సూర్యఘర్ కావాలి: కలెక్టర్ లక్ష్మీశ**

ఇంధనాన్ని వృథా చేస్తే డబ్బును వృథా చేసినట్లేనని.. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తెరిగి సేవ్ ఎనర్జీ – సేవ్ మనీ నినాదాన్ని సరైన విధంగా అర్థం చేసుకుంటూ ఇంధన పొదుపును పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. విద్యుత్‌ను ఆదా చేసే గృహోపకరణాలను వినియోగించడం ద్వారా 25 – 30 శాతం విద్యుత్‌ను ఆదా చేయొచ్చన్నారు. మీరు వినియోగించుకోగా అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్‌కు ప్రభుత్వం నుంచి తిరిగి డబ్బు పొందేందుకు వీలుకల్పించే పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ ఇంధన పొదుపును ప్రతిఒక్కరూ తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని.. సౌర, పవన తదితర పునరుత్పాదక ఇంధన వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకర పర్యావరణాన్ని భావితరాలకు బహుమతిగా అందిద్దామన్నారు. మనకు ఎంత అవసరమో అంతే విద్యుత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ లేనిదే అడుగు కూడా ముందుకేయలేని పరిస్థితి అని.. నాణ్యమైన విద్యుత్‌ను సరసమైన ధరలకు అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ దాదాపు 13 వేల మెగావాట్లు కాగా.. ఏటా ఇది ఏడు నుంచి 10 శాతం పెరుగుతోందని, ఈ నేపథ్యంలో విద్యుదుత్పత్తితో పాటు విద్యుత్ పొదుపును కూడా అలవరచుకోవాల్సిన అవసరముందన్నారు. ఒక యూనిట్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్లను ఉత్పత్తి చేసినట్లేనని పేర్కొన్నారు. నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్ బాబు.. మాట్లాడుతూ విద్యుత్ పరిరక్షణలో ఏపీ నెం.1గా ఉంటోందని, మిషన్ మోడ్‌లో విద్యుత్ పొదుపు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంధన పొదుపు చర్యలతోనే భావితరాలకు ఇంధన భద్రత సాధ్యమవుతుందన్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించడంతో పాటు ఇంధన వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీలు, సమావేశాలు తదితరాలతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాజాత ప్రదర్శనలతో విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, పవర్ యుటిలిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జాతీయ సేవా పథకం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** వ్యవసాయ కళాశాల బాపట్ల వారు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం ఘంటసాల గ్రామంలోని శ్రీ సాయి మినీ కళ్యాణమండపం ప్రాంగణంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న సభ ముగిసింది. ఈ ముగింపు లో కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆర్గనైజర్ డాక్టర్ సి. సంధ్యారాణి, ప్రిన్సిపల్ రిప్రజెంటేటివ్ డాక్టర్ ఏ.జె సువర్ణ లత, నరసరావుపేట విద్యార్థుల ప్రోగ్రాం ఆర్గనైజర్ డాక్టర్ జి. విజయ్ కుమార్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రె పాటి. రామకృష్ణ, గ్రామ సర్పంచ్ బి. వెంకటేశ్వరమ్మ, ఆదర్శ రైతు అయినంపూడి విజయ్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు తమ సందేహాలను తెలుపగా డాక్టర్ డి.సుధారాణి సందేహాలను నివృత్తి చేశారు. మినుము సాగులో కాండం గజ్జి, బంగారు తీగ యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. మినుములో విత్తన శుద్ధి కొరకు ట్రైకోడెర్మ విరిడి పొడి మందును కేజీ విత్తనానికి 10 గ్రా చొప్పున కలుపుకుని విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. మొక్కలు చనిపోతుంటే మెటలాక్సిల్ ఏ మాంకోజెబ్ మందును 400 గ్రా. ఎకరానికి చొప్పున పిచికారీ రూపంలో కాకుండా నేలను తడిచేలా చూసుకోవాలని తెలిపారు. బాపట్ల నుంచి వచ్చిన ప్రొఫెసర్స్ అందరూ విద్యార్థులను రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు అందరికీ సర్టిఫికెట్స్ అందజేయబడినవి.

# వి.వి. ఫార్మసీలో యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం




**గుడ్లవల్లేరు డిసెంబర్ 15 మేజర్ న్యూస్:** స్థానిక గుడ్లవల్లేరు లోని వి.వి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లోని యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ర్యాగింగ్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం, భద్రతతో కూడిన విద్యా వాతావరణాన్ని ఏర్పాటు చేయడం లక్ష్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడివాడ డీఎస్పీ వి. ధీరజ్ వినీల్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అలాగే గుడివాడ రూరల్ సీఐ ఎస్–ఎల్ఆర్ సోమేశ్వర రావు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వారు ర్యాగింగ్ ఒక శిక్షార్హమైన నేరమని, ర్యాగింగ్‌లో పాల్గొన్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా బాలికల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ఏవైనా బ్యాడ్ టచ్ సంఘటనలు ఎదురైనపుడు భయపడకుండా ఎలా స్పందించాలి, వెంటనే ఎవరికీ సమాచారం ఇవ్వాలి అనే అంశాలను వివరించారు. అలాగే సైబర్ మోసాలకు బలికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ లావాదేవీల్లో అప్రమత్తత, వ్యక్తిగత సమాచార రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటి ప్రభావం వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ జీవితం, సమాజంపై ఎలా ఉంటుందో ఉదాహరణలతో వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భద్రతపై అవగాహన మరింత పెరిగిందని తెలిపారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే తక్షణమే పోలీసు సహాయం కోసం 112కు కాల్ చేయాలి, అలాగే సైబర్ నేరాల విషయంలో 1930 హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. లక్ష్మణరావు అధ్యక్షత వహిస్తూ, ర్యాగింగ్ రహిత క్యాంపస్ నిర్మాణంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్, కార్యక్రమ కోఆర్డినేటర్ పి. భాగ్య రేఖ యాంటీ ర్యాగింగ్ సెల్ విధులు, ఫిర్యాదు విధానం, హెల్ప్‌లైన్ నంబర్ల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చల్లపల్లిలో కారు బీభత్సం

**టూవీలరు, ఇద్దరు మహిళలను ఢీకొని పాదచారిని ఢీకొన్న వైనం**

**అదే వేగంతో మండపాన్ని ఢీకొని ఆగిన కారు**

**పాదచారి హెల్త్ సూపర్వైజర్ అక్కడికక్కడే మృతి**

**ముగ్గురికి గాయాలు, ఇద్దరిని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలింపు**









**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి పోలీస్టేషన్ బజారులో సోమవారం సాయంత్రం కారు భీభత్సం సృష్టించిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం, చల్లపల్లి పోలీస్ స్టేషన్ బజారులో వెళుతున్న కారు ఇనుప దుకాణాల సమీపంలో టూవీలరు ఢీకొని, ఆ తర్వాత రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న నానమ్మ, మనవరాలిని ఢీకొని వేగంగా ముం దుకువెళ్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా నడుచుకుంటూ వెళుతున్న హెల్త్ సూపర్వైజర్ను ఢీకొంది. కారు ఢీకొనటంతో హెల్త్ సూపర్వైజర్ బానెట్పై పడిపోగా, కారు ఆగకుండా వేగంతో కొద్దిదూరం వెళ్లి మండ పాన్ని బలంగా ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో పురిటిగడ్డ పీహెచ్సీలో హెల్త్ సూపర్వైజర్గా పనిచేసు న్న నాగాయలంకకు చెందిన నందిగామ కమలాకర రావు (60) కారుబానెట్పై పడి అక్కడికక్కడే మృతిచెం దాడు. కారు నడుపుతున్న వ్యక్తి బ్రేక్ వేయబోయి ఎక్సలేటర్ నొక్కినట్లు చెబుతున్నారు. మృతిచెందిన కమలాకరరావుకు భార్య, కుమార్తె ఉన్నారు.

**ముగ్గురికి గాయాలు, ఇద్దరిని మచిలీపట్నం తరలింపు**

కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న గెల్లి రాధాకృష్ణ పడిపోవటంతో గాయాలయ్యాయి. హోటల్, ఇళ్లలో పనులు చేసుకునే కూతాడి నాగమల్లేశ్వరి, ఆమె మనమరాలు జనీలియాలకు తీవ్రగాయలయ్యా యి. తొలుత వారిని 108 అంబులెన్స్లో చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్సల అనంతరం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారు నడిపిన వ్యక్తి స్థానిక పొట్టిశ్రీరాములు వీధిలోని వాటర్ప్లాంట్ నిర్వాహకుడు శ్రీనివాసరావుగా స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తికి సైతం గాయాలుకాగా, అతడిని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కారు కొత్తగా నేర్చుకుంటున్నాడనీ, పూర్తిస్థాయిలో అనుభవం రాలేదని చెబుతున్నారు. కారును సీజ్చసిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేటి నుండి ధనుర్మాసం ప్రారంభం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నేటి నుండి పవిత్రమైన ధనుర్మాసం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అవనిగడ్డ పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెల్లవారుజామునే భక్తులు లేచి స్నానాదులు ఆచరించి, విష్ణు నామస్మరణతో పూజలు నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసంగా భావించబడుతుంది. ఈ మాసంలో చేసే పూజలు, వ్రతాలు విశేష ఫలితాలను ఇస్తాయని పండితులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు తిరుప్పావై వ్రతం ఆచరిస్తూ భక్తిశ్రద్ధలతో గోపికా భావనలో పూజలు చేస్తున్నారు. ధనుర్మాసం సందర్భంగా స్థానిక గీతా మందిరం, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయం, మండల పరిధిలోని వేకనూరు, పులిగడ్డ మోదుమూడి, అశ్వరావుపాలెం తదితర గ్రామాల్లోని వైష్ణవ ఆలయాలలో తెల్లవారుజామునే సుప్రభాత సేవలు, విశేష అభిషేకాలు, హరినామ సంకీర్తనలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భజనలు, నామస్మ రణ, దీపారాధనలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉదయం వేళల్లో ఆలయాల చుట్టూ భక్తు ల సందడి కనిపిస్తోంది. ధను ర్మాసంలో అన్నదానం, వస్త్రదా నం, దీపదానం చేయడం శు భప్రద మని విశ్వాసం. ఈ నేపథ్యంలో పలువురు భక్తులు పేదలకు అన్నదానం చేసి పు ణ్యం సంపాదిస్తున్నారు ధను ర్మాసం భోగి పండుగతో ముగియనుంది.



ఈ మాసం మొత్తం భక్తులు నియమ నిష్ఠలతో గడుపుతూ ఆధ్యాత్మిక చింతనలో పాల్గొనడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆళ్వార్ సంతతికి చెందిన ఆండాళ్ అమ్మవారు రచించిన తిరుప్పావై పాసురాలు ధనుర్మాసంలో విశేష ఫలితాలను ఇస్తాయని శాస్త్రోక్త నమ్మకం ఉంది. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ ఒక పాసురాన్ని వివరిస్తూ పండితులు, ప్రవచనకర్తలు శ్రీకృష్ణ తత్త్వాన్ని, భక్తి మార్గాన్ని వివరిస్తున్నారు. ధనుర్మాసం ప్రారంభంతో అవనిగడ్డ ప్రాంతమంతా భక్తి భావాలతో పరవశిస్తోంది.

## సత్సంబంధాలు కలిగి ఉండాలి

**మొవ్వ మేజర్ న్యూస్:** పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని గుడివాడ డి.ఎస్. పి. ధీరజ్ వినీల్ కూచిపూడి పోలీ సుల కు దశ దిశ నిర్దేశించారు. కూచిపూడి పోలీస్ స్టేషన్ ను డి.ఎస్.పి సోమవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూచిపూడి పోలీస్ స్టేషన్లోని రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అ నంతరం స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులు, నిందితుల పట్ల అమర్యాదగా ప్రవర్తించరా దని ఫ్రెండ్లీ పోలీస్గా వ్యవహరిం చి మన్నన లు పొందాలని సూచించారు. కూచిపూడి పో లీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సచి వాలయం మహిళా కానిస్టేబుల్లను విధి నిర్వహణలో సద్వినియోగపరుచుకుని తద్వా రా గ్రామాల్లో క్రైమ్ రేటును తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని సూచి ంచారు. అలాగే గ్రామాల్లో గంజాయి, కోడి పం దాలు, జూదం వంటి అసాంఘికార్యపాల పట్ల దృష్టి పెట్టాలని డి.ఎస్.పి ధీరజ్ వినీ ల్ కూచిపూడి పోలీసుల ను ఆదేశించారు. పామర్రు సీ.ఐ వి. సుభాక ర్, కూచిపూడి ఎస్సైఐ శిరీషలు పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలే ఈ లోకానికి ఆదర్శం

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఏసుక్రీస్తు బోధనలకు అనుగుణంగా సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమ, ఆత్మీయత కనబరిస్తే సమాజంలో శాంతి, సౌఖ్యం విరజిల్లుతాయి నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ (రాజా) పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల వెంకట్రావు పాల్గొని ప్రసంగిస్తూ యేసుక్రీస్తు శాంతి బోధనలే నేడు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని, ప్రతి ఒక్కరూ మోక్షం చేరుకోవాలంటే యేసుక్రీస్తు మార్గంలో పయనించాలని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. నిర్వాహకులతో కలిసి వెంకట్రామ్ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర సోదరీమణులకు అడ్వాన్స్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏలూరు నుంచి వచ్చిన బిషప్ డాక్టర్ కారుపాటి శాంతి సాగర్ క్రీస్తు బోధనలు బోధించారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, సర్పంచ్ బాణావత్తు వెంకటేశ్వరమ్మ, యేసే జవాబు పరిచర్యలు అధినేత రెవరెండ్ వేమూరి పరిశుద్ధ రాజు, ప్రముఖులు పేర్ల శ్రీనివాసరావు (పీఎస్ రావు), మాదివాడ వెంకటకృష్ణ (క్రిస్టియన్), ఘంటసాల మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యెనిగళ్ల సాల్మన్ రాజు, ఉపాధ్యక్షులు యర్రగుంట షాలేం రాజు, కార్యదర్శి యర్రగుంట మధు బాబు, సహాయ కార్యదర్శి కావూరి నవీన్ బాబు, కోశాధికారి కావూరి సతీష్ పాల్, కమిటీ సభ్యులు గండ్రపు మోషే, మట్టా యెషయా, శీరం సుందర్ సింగ్, కంభం యేసు ముత్యాలు, జువ్వనపూడి జీవన్ బాబు, కె. సాల్మన్ రాజు, కోలా వినయ్ కుమార్, ఇమ్మానుయేలు ఐక్య కాపరుల సహవాసం నాయకులు తాతా సత్యమూర్తి, గోల్కొండ డేవిడ్, ఘంటసాల మండల పాస్టర్లు, ఘంటసాల, చల్లపల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవ విశ్వాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గీతామాతకు ఘన నివాళి

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల లోని ఆధ్యాత్మిక జ్ఞాన సమాజం (గీతామందిరం) లో 18 అధ్యాయముల భగవ ద్గీత పఠనం సంపూర్తిగా చే శారు. మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షు రాలు గొర్రెపాటి మధుర మీనాక్షి మాట్లాడుతూ ఈగీతామందిరం లో గుత్తి కొండ కోకిలంబ దంపతులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించా రని, పలు చోట్ల సంఘ సేవా కార్యక్రమాలు కూడా ఇతోధికంగా నిర్వహిం చారని, అందువలన వారి ఆత్మ శాంతి కొరకు భగవద్గీత పఠనంతో నివాళు లు అర్పించామని. చెప్పారు.

పఠనములో బండి ధనలక్ష్మి, వేమూరి సత్య వతి, మూల్పూరి నవరత్నం, భారతి, తుమ్మల వనిత, గెల్లి యోగి, సంకా గౌరీ, వేణు, అయినపూడి మంగమ్మ, గొర్రెపాటి లక్ష్మి, వేమూరి శ్రీ లక్ష్మి, కు మారి, సంకా రోహిణి, గొర్రెపాటి పద్మ, గొర్రెపాటి రోజారాణి పాల్గొన్నారు.

## లైబ్రేరియన్ సుజాతకు ఘన సత్కారం

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీకాకుళం లో గత ఏడు సం"గా లైబ్రేరియన్గా విధులు నిర్వహించి, బదిలీపై గొల్లపూడికి వెళ్తున్న సుజాత కు కూటమి నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంలో ఆమె పాత్ర కీలకమని పేర్కొంటూ, కొత్త ప్రాంతంలో కూడా ఇదే విధమైన సేవలు అందించాలని, మరింత ఉన్నత గ్రామంలోనిస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉప సర్పంచ్ శీలం శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దాసం రామకృష్ణ, జనసేన పార్టీ నాయకులు కొండవీటి నాని ఆదిరాల కనకదుర్గ, సిబ్బంది తదితరులు ఆమెను సన్మానించారు.

## అవనిగడ్డ లో వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో జనవరి 10,11 తేదీలలో వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్ తెలిపారు. సోమవారం ఆయన వీడియోతో మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు, స్వామి వివేకానంద జయంతి జాతీయ యువజన దినోత్సవము సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చిరకాల వాంఛతో ఈ వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాజకీయ, సామాజిక సేవా రంగాలలో పనిచేస్తూ సేవలందించాలని ఆసక్తి ఉన్న 30ఏ ళ్ల లోపు యువతీ, యువకులకు ఈ శిబిరం ద్వారా నాయకత్వ లక్షణాలు, ఉపన్యాస కళ, ఆశావాద దృక్పథం, ఆరోగ్యం, దేశభక్తి మొదలగు అంశా లపై ప్రముఖులచే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమయపాలన, క్రమశి క్షణ తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు గుడిసేవ విష్ణుప్రసాద్ 9441149608, యలవర్తి సతీష్ 9949142606 నెంబర్లను సంప్రదించి, బయోడేటాను పంపి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండలంలోని పలు గ్రామాలలో ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం సాయంత్రం స్వ యంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

మండల పరిధిలోని మేడూరు గ్రామానికి చెందిన గంజాల శివ పార్వతికి 20 వేల రూపాయలు, మస్తానీ బేగం కు 25,920 రూపాయలు, హనుమంతపురం గ్రామంలో రాజులపాటి వెంకటనారాయణకు 50,213 రూపాయలు, రాజులపాటి వరలక్ష్మికి 55,786 రూపాయలు, కపిలేశ్వరపురం గ్రామంలో జువ్వనపూడి నాగేశ్వర రావుకు 35,541 రూపాయలు, కొల్లిపర శ్రీనివాసరావుకు 37,292 రూపాయలు వంతున మంజూరైన చెక్కులను స్వయంగా ఎమ్మెల్యే కుమార్ రాజా చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు లింగమనేని బాబురావు, కొల్లిపర బాబి, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ ఎస్ నూతన కమిటీ ఎంపిక

**మైలవరం, మేజర్ న్యూస్ :** మైలవరం టౌన్ నూతన కమిటీని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి పద్మ మందకృష్ణ నాయకత్వంలో నూతన కమిటీలు ఎన్నుకున్నారు. మైలవరం లోని దళితవాడలో సోమవారం కమిటీలను ఎన్నుకున్నారు. ఎం ఆర్ పి ఎస్ ఎం ఎస్ పి సామాజిక ఉద్యమ అభినందనలతో ఏ మార్పిఎస్ ఎంఎస్పి మైలవరం నియోజవర్గం ఇంచార్జి ఇంకొల్లు జమలయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కోట బెనర్జీ మైలవరం, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడు ఓలేటి ఏసు ఎంఎస్పి మైలవరం, టౌన్ అధ్యక్షుడు ప్రత్తిపాటి రాంబాబులను నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

పత్తిపాటి ఏసురత్నం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి కొంగులు ప్రేమ్ కుమార్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కొంగుల రామారావు, సుందరం యెహోను శీను, మహిళలు, మత్తయ్య, పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించామని ఆరోగ్య శ్రీ పథకం ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ ప్రమోషన్లు రిజర్వేషన్ సాధించుకున్నట్లు తెలిపారు. పోరాటాలు ఉద్యమాలు చేయటం వల్ల సమస్యలు సాధించుకున్నట్లు తెలిపారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆత్మగౌరవ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# భవాని దీక్ష విరమణ ఏర్పాట్లు విజయవంతం





## 80 మెట్రిక్ టన్నుల భవాని దుస్తులను తొలగించాం

## వీఎంసి సిబ్బందిని అభినందించిన కమిషనర్

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర భవాని దీక్ష విరమణ ఏర్పాట్లలో చివరి రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగరాదని, వినాయకుని గుడి, కెనాల్ రోడ్, మోడల్ గెస్ట్ హౌస్, వాటర్ పాయింట్లు, టాయిలెట్ల పాయింట్లు, కేశఖండన శాల, హోల్డింగ్ ఏరియా, ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవాని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అధిక మొత్తంలో వాటర్ పాయింట్లలో తాగునీటి వాటర్ బాటిల్ స్టాక్ లను పెట్టుకుంటూ ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ఆదేశాల మేరకు నిర్వహించిన భవాని దీక్ష విరమణ ఏర్పాట్లు విజయవంతంగా నిర్వహించినందుకు కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం, వి ఎం సి సిబ్బంది, వారి కృషిని అభినందించారు. తాగునీటి సౌకర్యాలలో ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు వాటర్ బాటిల్ స్టాక్ లను నింపుకుంటూ క్యూ లైన్ లో వచ్చే వారికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో హెడ్ వాటర్ వర్క్స్ నుండి వాహనాల సౌకర్యాలతో స్టాక్ పాయింట్లలో ఎప్పటికప్పుడు తాగునీరును స్టాక్ చేసుకుంటూ, అక్కడనుండి ఏర్పాటు చేసిన 68 ప్రదేశాలలో వాటర్ పాయింట్లలో తాగునీరు అందుబాటులోకి తీసుకొస్తూ, కమాండ్ కంట్రోల్ రూమ్ సహాయంతో అవసరమైన ప్రతినిత్యం వెంటనే వాటర్ బాటిల్స్ ఉండేటట్టు చూసుకున్నాం అని అన్నారు. 300 ఇంజనీరింగ్ అధికారులు, వెహికల్ డిపో సిబ్బంది సమన్వయంతో 22 లక్షల వాటర్ బాటిళ్ళు, 8 లక్షల వాటర్ ప్యాకెట్లు, ఎటువంటి అంతరాయం లేకుండా పంపిణీ చేశామని అన్నారు. 28 ప్రదేశాలలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రమైన మరుగుదొడ్లను ప్రజలకు అందిస్తూ, మరుగుదొడ్లు పరిసర ప్రాంతాలలో కూడా ఎటువంటి దుర్వాసన రాకుండా 15,000 లీటర్స్ సెంటెడ్ ఫినాల్‌తో ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నారని, 25 గల్ఫర్ వాహనాలతో ఎప్పటికప్పుడు మరుగుదొడ్ల వ్యర్థాలను తొలగిస్తున్నారని, తాత్కాలిక మరుగుదొడ్ల విషయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూసుకున్నారు అన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 8 చెప్పుల స్టాండ్, సామాన్లు భద్రపరచు ప్రదేశమును ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి సామాన్లను ఉచితంగా భద్రపరిచారని తెలిపారు. 350 మంది ఎస్టేట్ విభాగం నుండి ఈ ఏర్పాటులలో దీని నిమిత్తం పని చేశారని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకంగా 1690 పారిశుద్ధ్య కార్మికులతో మూడు షిఫ్ట్ లలో పారిశుద్ధ్యంలో ఎటువంటి లోటు లేకుండా ఎప్పటికప్పుడు తాగేసి పడేసిన వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, పాల గ్లాసుల వ్యర్థాలను తొలగిస్తూ, ఘాట్ల వద్ద భవానిల దుస్తులు తొలగిస్తూ, గిరి ప్రదక్షణ, దర్శనాల రహదారుల్లో 3500 డస్ట్ బిన్నులు, 25 ప్రదేశాలలో 60 కంపాక్టర్ బిన్నులను, ఆ వ్యర్థాలను తొలగించేందుకు ట్రాక్టర్లు, డీసీఎం వాన్లు, సిఎన్జి ఆటోలు, కంపాక్టర్ వంటి వాహనాలను ఉపయోగించి పారిశుద్ధ్య నిర్వహణ చేస్తూ, 250 మెట్రిక్ టన్నుల బ్లీచింగ్ పౌడర్ దర్శన రహదారుల్లో వేశారని, భవాని విడిచిన దుస్తులను, కన్వేయర్ బెల్ట్, వాహనాల సహాయంతో ఎప్పటికప్పుడు తొలగిస్తూ, మెరుగైన పారిశుధ్య నిర్వహణ తో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణన్ని కల్పించామని అన్నారు. ఇప్పటివరకు దాదాపు 380 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను, 80 మెట్రిక్ టన్నుల భవాని దుస్తులను తొలగించారని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రత్యేకంగా గిరి ప్రదక్షణ మార్గంలో 200 మంది సిబ్బందికి విధులు కేటాయించామని, భవాని దీక్ష విరమణలో ఎక్కడ అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు వివిధ ప్రదేశాలలో విధులు నిర్వహిస్తున్న వారు, వారి అవసరాలను, డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తూ, కమాండ్ కంట్రోల్ రూమ్ లో 24 గంటలు మూడు షిఫ్ట్ లలో పని చేస్తున్న సిబ్బంది తో మాట్లాడి ఎక్కడ ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకున్నామన్నారు. భవాని దీక్ష విరమణ ఏర్పాట్లలో విజయవాడ నగర పాలక సంస్థ వారు చేయవలసిన ఏర్పాట్లలో విజయవంతంగా నిర్వహించినందుకు వీఎంసి సిబ్బందిని అభినందించారు.







## బేతేలు చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

**ఇబ్రహీంపట్నం, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం లోని బేతేలు చర్చి వారు ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు స్థానిక సంఘ కాపరి, నల్లమోతు షా లెమ్ సంఘస్తులు ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి జోగి రమేష్ తనయుడు యువ నాయకులు జోగి రాజీవ్, పాల్గొని క్రిస్మస్ కేకు కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నల్లమోతు మధు, నల్లమోతు ప్రకాష్, నల్లమోతు రవిబాబు, సోడగుడి కోటేశ్వరరావు, నల్లమోతు సురేష్ బాబు, లింగాల సంగీతరావు, నల్లమోతు జున్ను, పరిమి కిషోర్, గోగులమూడి రాణి, నంబూరు వెంకయ్య, కూచిపూడి భూపతి,, బేతేలు సంఘస్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నైనవరంలో అయ్యప్ప స్వామి ఇరుముడులు



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** మండలంలోని పి.నైనవరం గ్రామంలో శివ నాగేంద్ర ఆలయంలో ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములు ఆలయంలో గురు స్వామి సమక్షంలో ఇరుముడిని స్వీకరించారు. అనంతరం పాముల కాలవ వరకు పురవీధులలో నడుస్తూ స్వామియే అయ్యప్పో అయ్యప్పో స్వామియే అంటూ భజన చేయడంతో గ్రామంలో కోలాహల వాతావరణం నెలకొంది. దాదాపు 60 మంది స్వాములు ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్ళారు.

## ఇంధనం పొదుపు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలి

### జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం నవీన్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ ఇంధనం పొదుపు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ నుండి విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీని సంయుక్త కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యుత్తును పొదుపుగా వినియోగిస్తే ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. గృహపకరణాలలో మూడు లేదా అంతకంటే ఎక్కువ నక్షత్రాలు ఉన్న వస్తువులను వినియోగిస్తే 30% పైగా విద్యుత్తు పొదుపు అవుతుందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రైల్వే క్రాసింగ్ వద్ద వాహనదారులు ఇంజన్లను ఆపివేసి ఇంధనాన్ని పొదుపు చేయాలన్నారు. ఈ ర్యాలీలోమచిలీపట్నం సబ్ డివజన్ ఈ ఈ శ్రీనివాసరావు, టౌన్ రూరల్ ఎడిలు, శ్రీనివాస్, రామకృష్ణ, పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మీకోసం అర్జీలను అత్యధిక ప్రాధాన్యతతో సకాలంలో పరిష్కరించాలి

## కలెక్టర్ డీకే బాలాజీ




**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందుతున్న మీకోసం అర్జీలను అత్యధిక ప్రాధాన్యతతో శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, అదనపు ఎస్పీ సత్యనారాయణ కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డిఓ స్వాతిలతో కలసి నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల బాధలు సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో అర్జీలను పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు సంబంధించిన నివేదికలను సాయంత్రంలోగా తనకు అందజేయాలని ఆదేశించారు. ఆ ప్రకారం కలెక్టరేట్లో మొత్తం 151 అర్జీలు వారు స్వీకరించారు. కృష్ణాజిల్లాలో ప్రాథమిక వైద్య కేంద్రాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు చాలా సమస్యలతో బాధపడుతూ ఉద్యోగాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ కృష్ణాజిల్లా స్ట్రగుల్ కమిటీ జిల్లా కార్యదర్శి సౌమ్య రేఖ పలువురు స్టాఫ్ నర్సులు కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుఅర్జీ అందజేశారు. జిల్లాలో అన్ని ప్రాథమిక వైద్య కేంద్రాల్లో ముగ్గురు స్టాఫ్ నర్సులు మాత్రమే మూడు షిఫ్టులలో పని చేస్తున్నారని, ఒకరోజు తీసుకునే డే ఆఫ్ (వీక్లీ ఆఫ్) ఇవ్వడానికి వైద్యాధికారి నిరాకరిస్తున్నారని, అత్యవసర సమయంలో కూడా సాధారణ సెలవు ఇవ్వడానికి వైద్యాధికారి నిరాకరిస్తున్నారని ఆ అర్జీలో పేర్కొన్నారు. రాత్రి షిఫ్ట్ లో భద్రతా సిబ్బంది లేదా సపోర్టింగ్ షాప్ లేకుండా మహిళా స్టాఫ్ నర్స్ ఒకరు మాత్రమే అభద్రత భావంతో విధులు నిర్వహించాల్సి వస్తుందని ఆరోపించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నాలుగవ స్టాఫ్ నర్స్ సపోర్టింగ్ స్టాఫ్ ను ఏర్పాటు చేయాలని అందులో కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డ్వామా పీడీ శివప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ సోమశేఖరు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ యుగంధర్, డిపిఓ డాక్టర్ జె అరుణ, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, ఆర్ అండ్ బిఈఈ లోకేష్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999